లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య


వినోద్‌కుమార్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు..బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన మరిగిద్దె వినోద్‌కుమార్ (35) కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. చింతల్ శ్రీరాంనగర్‌లో ఉంటూ బోయిన్‌పల్లిలోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి భార్య మంజూషదేవి, కుమారుడు అభిరానందన్ (4), కుమార్తె నందన(3) ఉన్నారు. కాగా ఇటీవల వినోద్‌కుమార్ బంధువు శంకర్‌రావు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో రూ.4 లక్షలు ఖర్చు చేశాడు. దీనికి తోడు 3 నెలలుగా తాను పని చేస్తున్న సంస్థ జీతాలు సరిగ్గా చెల్లించడం లేదు. దీంతో ఆర్థిక సమస్యలు తీవ్రం కాగా తన భార్యకు తెలియకుండా ఆమె ఫోన్ నుంచి లోన్‌యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో లోన్‌యాప్ నిర్వాహకులు భార్య ఫొటోను మార్ఫింగ్ చేసి బంధువులకు పంపించారు. వినాయక చవితి పండుగకు భార్యను తన బావమరిది ఇంటికి పంపించాడు. లోన్‌యాప్ వేధింపుల విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గ్రేడింగ్'తో మహిళల అభ్యున్నతి!

మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మహిళా శక్తి పేరిట కొత్త కార్యక్రమాన్ని చేపట్టి మహిళా అభ్యుదాయానికి ఇందులో భాగంగా పలు వ్యాపారాలు చేసుకునేందుకు వారికే ప్రాధాన్యం ఇస్తున్నారు. బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించడమే కాకుండా స్వయం ఉపాధి దిశగా మళ్లిస్తున్నారు. సంఘాల్లో సభ్యులను అనుభవం ఉన్న రంగంలో రాణించేలా ప్రత్యేక రుణాలను సైతం మంజూరు చేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

- మహిళా సంఘాల ఆర్థిక ప్రగతి దిశగా అడుగులు
- స్వయం ఉపాధికి ప్రత్యేక రుణాలు సంఘాల పనితీరు బట్టి గ్రేడింగ్
- ప్రమాణాలు పాటించే మహిళా సంఘాలకు ప్రాధాన్యం



జిల్లా	గ్రామ మహిళా సంఘాలు	సహాయక సంఘాలు	సభ్యులు
రంగారెడ్డి	788	19,209	2,06,116
మేడ్చల్	188	3,395	36,911
మేడ్చల్ (అర్బన్)	208 (ఏరియా)	7,245	72,450

● బ్యాంకుతో పాటు స్త్రీ నిధి రుణాలూ అందుతుండటంతో ఆర్థిక సమస్యలను అధిగమించే దిశగా మహిళా సంఘాల సభ్యులు ముందుకు సాగుతున్నారు. సంఘాలను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో గ్రేడింగ్ విధానాన్ని సైతం అమలు చేస్తుండటం గమనార్హం.

అంశాల వారీగా...

నగర శివారు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో స్వయం సహాయక మహిళా సంఘాలు 22,604 ఉండగా, ఇందులో 2,43,07 మంది మహిళా సభ్యులు ఉన్నారు. అలాగే, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 13 పురపాలక సంఘాల్లో 7,245 మహిళా సంఘాలు ఉండగా, ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు. మహిళా సంఘాలకు పనితీరును బట్టి గ్రేడింగ్ కేటాయిస్తారు. ఇందుకు 12 అంశాలను నిర్దేశించారు. వాటి ఆధారంగా ఏ, బీ, సీ, డీ, ఈ గ్రేడింగ్‌లు ఇస్తారు. ఒక్కో సంఘం 75 శాతా పైగా సాధిస్తే ఏ 70 నుంచి 75లోపు ఉంటే బీ, 60 లోపు సాధిస్తే సీ, 60 శాతం కంటే తక్కువగా ఉంటే 'డీ', అంతకంటే తక్కువగా ఉంటే ఈ అని నిర్ణయిస్తారు.

రుణాలు పొందడం...

గ్రామ మహిళా సంఘాలకు ఇప్పటి వరకు గ్రేడింగ్ విధానం అమల్లో ఉంది. ఇక నుంచి ఏ, బీ, సీ గ్రేడింగ్ ఉన్న గ్రామ సంఘాలకు మాత్రమే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు సైతం ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌ల్లో వెనుకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందడం కష్టంగానే ఉండనుంది.

పెరిగిన పర్యవేక్షణ...

గ్రేడింగ్ విధానం అమల్లోకి వచ్చిన కారణంగా మహిళా సంఘాలపై పర్యవేక్షణ పెరుగుతోంది. ఇప్పటికే సంఘాల సమావేశాలకు సంబంధించి అక్షాంశ, రేఖాంశాలతో కూడిన లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. దీన్ని యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటోంది. రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. గ్రేడింగ్‌ల్లో వెనుకబడకుండా అధికారులు సంఘాల వారీగా ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని సమీక్షిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా సూచనలు కూడా చేస్తున్నారు.

సభ్యులకు ప్రయోజనాలు...

మహిళా స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గ్రేడింగ్ విధానంతో సంఘాల్లో సభ్యులకు పలు ప్రయోజనాలు ఉన్నాయి. సమావేశాలు పక్కాగా నిర్వహించడంతోపాటు బ్యాంకు, స్త్రీనిధి రుణ వాయిదాలు సక్రమంగా చెల్లిస్తేనే మంచి గ్రేడింగ్ సాధించేందుకు వీలుంటోంది. అన్ని సంఘాలపై పర్యవేక్షణ పెంచుతాం.

– సాంబశివరావు, డీఆర్డీవో, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

చిన్నారులకు క్రీడా పోటీలు




కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ ఉడ్స్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చిన్నారులకు క్రీడలపై ఆసక్తి పెంచేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. గణేశ్ నవరాత్రుల నేపథ్యంలో సైక్లింగ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు.ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఇది ఉపశమనంగా ఉంటుందని వారి తల్లిదండ్రులతో మాట్లాడి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని సంక్షేమ సంఘం ప్రతినిధి భిక్షపతి తెలిపారు.

ప్రజావాణికి 14 ఫిర్యాదులు


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 14 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణికి 10 ఫిర్యాదులు రాగా వాటిని వివిధ విభాగాల అధికారులకు అందజేశారు. అదేవిధంగా గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 4 ఫిర్యాదులు రాగా వారంలోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న బాచుపల్లి పోలీసులు

నిజాంపేట్: అదృశ్యమైన బాలుడిని బాచుపల్లి పోలీసులు గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పకు చెందిన అప్పన్న, కృష్ణవేణి కుమారుడు కిరణ్‌సాయి (13) ఈ నెల 8న ఉదయం 6.30 గంటలకు చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి బాలుడి కోసం గాలింపు చేపట్టారు. ఖైరతాబాద్ వినాయకుడి వద్ద కిరణ్‌సాయి ఉన్నట్లు గుర్తించి పోలీసులు అదే రోజు రాత్రి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. గణేశుడిని చూసేందుకు వెళ్లినట్లు కిరణ్‌సాయి తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన బాచుపల్లి పోలీసులను కూకట్‌పల్లి ఏసీపీ అభినందించారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం


మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్


మైనంపల్లి హన్మంతరావు ఇంటికి చేరుకున్న కార్యకర్తలు

సుభాష్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ సోమవారం ధూలపల్లిలోని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి నివాసానికి రాగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఖమ్మంలోని వరద బాధితులకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో సమకూర్చిన నిత్యావసర వస్తువులు తరలిస్తున్న వాహనాలను టీపీసీసీ అధ్యక్షుడు నేతలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల కృషి వల్లే అధికారంలోకి వచ్చామని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రతిపక్షాల తమ ఉనికి కోసమే మాట్లాడుతున్నాయని కానీ వారికి అవకాశమే దొరకడం లేదని కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, కొలను హనుమంత్ రెడ్డి, నర్సిరెడ్డి భూపతి రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్లైవుడ్ దుకాణం దగ్ధం


మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

సుభాష్‌నగర్: షార్ట్ సర్క్యూట్‌తో ప్లైవుడ్ దుకాణం దగ్ధమైంది. గాజులరామారం డివిజన్ మహాదేవపురం చౌరస్తాలోని జై మాతాది ప్లైవుడ్ షాపులో సోమవారం ఉదయం 6 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే జీడిమెట్ల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు తగ్గకపోవడంతో పక్కనే ఉన్న కూకట్‌పల్లి ఫైర్ సిబ్బంది కూడా అక్కడికి చేరుకొని గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ. 50 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని కరణ్‌గౌడ్ తెలిపారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో సేవల అనుసంధానం



కుత్బుల్లాపూర్: ఆరిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు అన్ని రకాల సేవలను అనుసంధానం చేస్తున్నారని విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ రవికుమార్ అన్నారు. పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ అంశాలపై 3 రోజుల పాటు విద్యార్థులకు సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో రోబోట్ పని చేసే విధానాన్ని ప్రయోగతాత్మకంగా విద్యార్థులకు వివరించామన్నారు. అలాగే వారికి మదర్ బోర్డ్ అత్యవసర రిమోట్ సెన్సార్ కిట్స్ వంటివి అందజేసి స్వయంగా వస్తువులు తయారు చేసేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో బాట్ లైవ్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మూసాపేట: మూసాపేట భరత్‌నగర్‌లో శక్తి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వెంపటి కూచిపూడి నృత్య అకాడమీ వారు చేసిన రామాయణం, కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. గురువు వెంపటి లక్ష్మణ కుమార్ శిష్య బృందం మైలవరపు శిరీష, సుచిత్ర క్రాంతి, యోషిత, మనోజ్ఞతో పాటు చిన్నారి కళాకారులు అద్భుతమైన అంశాలను ప్రదర్శించారు. నిర్వాహకులు చిరంజీవి రెడ్డి, పాండు రంగారెడ్డి, సాయికృష్ణ, ప్రసాద్ అప్పారావు, రాజశేఖర్‌రెడ్డి కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.



ఘనంగా కాళోజీ జయంతి


భౌరంపేటలోని ప్రభుత్వ పాఠశాలలోఉపాధ్యాయులు..

కుత్బుల్లాపూర్: నగరంలోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో సోమవారం కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, హరీష్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా భౌరంపేటలోని జడ్పీ పాఠశాలలోనూ కాళోజీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్ రాంరెడ్డి, పద్మప్రియ, ప్రేమ్ కుమార్, జయంతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద్, పల్లా

హుండీ పగులగొట్టి నగదు అపహరణ



నిజాంపేట్: అమ్మవారి ఆలయంలో హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలోని నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం 3.30 గంటల సమయంలో పూజారి గుడికి వెళ్లి చూడగా హుండీ తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించగా వారు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో నగదుతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు దొంగతనానికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గణనాథుడి నిమజ్జనం

చింతల్: చింతల్ భాగ్యారథి డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని సోమవారం నిమజ్జనం చేశారు. ఐడీపీఎల్ చౌరస్తాలోని కళాశాల నుంచి పటాకులు కాలుస్తూ ఊరేగింపుగా సూరారం లింగం చెరువు వరకు గణనాథుడిని తరలించారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ నల్ల జైశంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ గోవింద్ రెడ్డి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణ, రాయల్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ రమేశ్ గంధం తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గణేశ్ లడ్డూ వేలం నిర్వహించగా రూ.21,500 ధర పలికింది. వేలం ద్వారా సమకూరిన ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినిగించనున్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు.



వైభవంగా గణేశ్ నవరాత్రులు


భరతనాట్యం చేస్తున్న చిన్నారి


మూడుగుళ్ల వద్ద పూజల్లో బీజేపీ నేత చెరకుపల్లి భరతసింహారెడ్డి


షాపూర్‌నగర్ పూజల్లో కాంగ్రెస్ నేత చౌడ శ్రీనివాస్‌రావు..


గాజులరామారం దేవేందర్‌నగర్‌లో..


కుత్బుల్లాపూర్ వాటర్ కార్యాలయంలో ..


జీడిమెట్లలో పూజలు..


మీనాక్షి కాలనీ గణేశ్ మండపం..

కుత్బుల్లాపూర్: వినాయక నవరాత్రోత్సవాలు నియోజకవర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం రెండోరోజు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు మండపాల వద్ద సంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శలు చేసి ఆకట్టుకున్నారు. పలు ప్రాంతాల్లో గణేశులను నిమజ్జనాలకు తరలించగా, అన్నదానాలు నిర్వహించారు.


కంచు గంటల గణనాథుడు..


గాజులరామారం పూజల్లో కూన శ్రీనివాస్‌గౌడ్.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో ప్రజలు

దుండిగల్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో ప్రతిష్ఠించిన మట్టి గణనాథుడికి పూజలు చేశారు. అలాగే పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులకు హాజరు కావాలని కోరుతూ పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

నిజాంపేట్: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 10న (నేడు) బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి డీకే అరుణ, ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.